మంగళవారం 16 జులై2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

## దంచికొడుతున్న వానలు...ఈ నెల 25 వరకు ఇట్లనే ఉంటయంట..



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 15 :దక్షిణ ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రానికి ఐఎండీ ఐదు రోజుల పాటు వర్ష సూచన వెల్లడించింది. దీంతో తెలంగాణకు ఐఎండీ ఆరెంజ్ అలెర్ట్ ను జారీ చేసింది. ఈ నెల 25వ తేది వరకు రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడతాయని పేర్కొంది. మరో వారం రోజుల్లో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని తెలిపింది. సాయంత్రం సమయాల్లో ఎక్కువగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. రాబోయే 24 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, భూపాలపల్లి జిల్లాల్లో భారీ అతి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ వున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

మంగళవారం 16 జులై2024





రైతులకు గుడ్‌న్యూస్.. రుణమాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల 2



భార్య 'టీ' పోయలేదని... భర్త సూసైడ్ 3



నేపాల్ నూతన ప్రధాని కేపీ శర్మ ఓలికి మోదీ శుభాకాంక్షలు 3



నేను చనిపోయాను అనుకున్నా..కాల్పుల ఘటనపై స్పందించిన డొనాల్డ్ ట్రంప్ 3

# ప్రత్యేక పూజల నడుమ ప్రారంభమైన మహంకాళీ అమ్మోరి ఘటం

### హాజరైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్...దాదాపు 12 రోజుల పాటు పురవీధుల్లో ఊరేగింపు

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 15 :** ప్రతి యేటా ఆషాడ మాసంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే అంబర్ పేట మహంకాళి అమ్మోరి బోనాల జాతరకు జోష్ షురూ అయింది. నిన్న ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజల నడుమ అమ్మవారి ఘటం ఊరేగింపుతో బోనాల జాతర ప్రక్రియ ప్రారంభమైంది.

ఈ పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరై పూజలు చేశారు. మహంకాళీ అమ్మవారి ఆలయం నుంచి ఘటం ఊరేగింపు ప్రారంభించి అంబర్ పేట గ్రామ పొలిమేరల్లోని పోత లింగన్న బొడ్రాయి వద్దకు చేరుకుంది. అక్కడ ప్రదక్షణల అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంది. దీంత దాదాపు 12 రోజుల పాటు అంబర్ పేటలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ నెల 28వ తేదీ ఆదివారం జోర్దార్ అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాల జాతర నిర్వహిస్తారు. తెల్లారి 29న సోమవారం అమ్మవారి ఆలయంలో రంగం( భవిష్యవాణి) వినిపిస్తారు..ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బి.పద్మ వెంకటరెడ్డి, అంబర్ పేట దేవస్థాన సేవా సమితి అడ్వైజర్ కె.దుర్గాప్రసాద్ రెడ్డి, చైర్మన్ పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్ గౌడ్, అధ్యక్షులు వై.శంకర్ గౌడ్,



ఉపాధ్యక్షులు రంగంపల్లి రాజు ,ప్రధాన కార్యదర్శి బింది మల్లికార్జున్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి దోమకొండ కిశోర్, కార్యదర్శి సీహెచ్ సుధాకర్, కోశాధికారి గడ్డం శ్రీధర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బి వెంకట్ రెడ్డి, ప్రతినిధులు పంజాల గిరిధర్ గౌడ్, చింతల శ్రీనివాస్ ముదిరాజ్, మోర శ్రీరాములు ముదిరాజ్, శంభుల శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం సందర్భంగా నల్లకుంట ఆషూర్ ఖానాలో ఏర్పాటు చేసిన పీర్లకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రత్యేక పూజలు చేసి దట్టీలు సమర్పించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు బి.పద్మావెంకట్ రెడ్డి, వై.అమృత తదితరులు ఉన్నారు.

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 15**

# స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు

### సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 15 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి నిధులు ఆగిపోకుండా, త్వరగా ఎన్నికలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఇప్పటి వరకు అనుసరించిన విధానాలపై పట్టిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సందేహాలు ఉంటే మాజీ మంత్రి జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్ శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని, చట్టపరమైన అంశాలపై అడ్వకేట్ జనరల్‌తో చర్చించాలని సీఎం సూచించారు. ఇతర రాష్ట్రాల్లో రిజర్వేషన్ల విధానంపై అధ్యయనం చేయాలని చెప్పారు. ఆయా అంశాలపై త్వరగా నివేదిక తయారు చేస్తే శాసనసభ సమావేశాలకు ముందే మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి తెలిపారు. పంచాయతీల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. గత పంచాయతీ ఎన్నికల్లో అనుసరించిన విధానం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధతపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కులగణన చేయడానికి ఎంత సమయం పడుతుందని సీఎం ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం 2011లో 53 కాలమ్స్‌తో కుల గణన చేసిందని, దానికి మరో మూడు జోడిస్తే, కనీసం అయిదున్నర నెలల సమయం పడుతుందని అధికారులు వివరించారు. సమావేశంలో సీఎస్ శాంతికుమారి, సీఎంవో ఉన్నతాధికారులు వి.శేషాద్రి, జి.చంద్రశేఖర్ రెడ్డి, బీసీ సంక్షేమం, పంచాయతీ రాజ్, న్యాయ శాఖల ముఖ్య కార్యదర్శులు బుర్రా వెంకటేశం, లోకేశ్ కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టులో కేసీఆర్ పిటిషన్

### విచారణ ఇయ్యాల్టికి వాయిదా



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 15 : కేసీఆర్ వేసిన పిటిషన్‌పై విచారణ ఇయ్యాల్టికి వాయిదా వేసింది సుప్రీం కోర్టు. సుప్రీంకోర్టులో ఎల్ నరసింహారెడ్డి విద్యుత్ కమిషన్ రద్దు చేయాలని సుప్రీం కోర్టును కేసీఆర్ ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరపనుంది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం. జస్టిస్ నర్సింహారెడ్డి రెడ్డి కమిషన్ సమన్ల పై జూలై 1న హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు లో సవాలు చేశారు కేసీఆర్. కేసీఆర్ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం తదితర అంశాలపై విద్యుత్ కమిషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి నేతృత్వంలో కమిషన్.. కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచింది. తనకు నోటీసులివ్వడం విచారణకు పిలవడంపై న్యాయపోరాటం చేస్తానని కేసీఆర్ అంటున్నారు. జస్టిస్ నరసింహారెడ్డి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని కేసీఆర్ ఆరోపించారు. కమిషన్ రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే తమ ముందు విచారణకు హాజరు కావాలని ఇప్పటికే కేసీఆర్‌కు నోటీసు పంపిన విచారణకు రాలేదని జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ తెలిపింది. దీంతో విద్యుత్ కమిషన్‌ను రద్దు చేయాలని కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు తిరస్కరించింది. కాగా, తెలంగాణ హైకోర్టు తీర్పును మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.


## ఇదేనా కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పు?

### రేవంత్ సర్కార్‌ను నిలదీసిన కేటీఆర్




ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 15 :మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఆర్కేపురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయంలో బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారిన సంగతి తెలిసిందే. ప్రొటోకాల్ ఉల్లంఘించి ఓడిపోయిన కాంగ్రెస్ నాయకునితో చెక్కులు పంపిణీ చేయించడంపై మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేజ్ కిందనే కూర్చొని ఆమె నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఓడిపోయిన అభ్యర్థులు స్టేజ్ పైన.. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన ఎమ్మెల్యే స్టేజ్ కిందనా.. అంటూ రేవంత్ సర్కార్‌ను కేటీఆర్ నిలదీశారు. అఫీషియల్ ప్రోగ్రాంలో ఓడిపోయిన అభ్యర్థులకు పని ఏంటి..? ఇదేనా కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పు..? ఇదేనా ప్రజా పాలన..? అంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మాజీ మంత్రి, ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సబితా ఇంద్రారెడ్డి ఒక ఎమ్మెల్యేగా తన హక్కుల కోసం నిరసన తెలపాల్సి వచ్చింది. ప్రజలచే తిరస్కరించబడిన వారేమో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇదేం దౌర్జన్యం అంటూ తెలంగాణ సీఎంవో, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజా పాలనలో ప్రజా ప్రతినిధులను ఇలాగే గౌరవిస్తారా..? అని నిలదీశారు కేటీఆర్.

### దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి: ఏఎంహెచ్‌వో హేమలత







ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 15 :దోమ కాటుతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, వీటి నుంచి బయటపడాలంటే ప్రతి ఒక్కరూ దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ ఏఎంహెచ్ వో హేమలత అన్నారు. సోమవారం అంబర్ పేట డివిజన్ ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్లో అంబర్ పేట మండల ట్రస్మా ఆధ్వర్యంలో దోమల నివారణపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుందన్నారు. వర్షాలు కురుస్తుండడంతో నీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి జరుగుతుందన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. జ్వరా లు వస్తే ప్రభుత్వాస్పత్రులకు వెళ్లి రక్తపరీక్షలు చేయించుకుని నిర్ధారించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాధుల మధుసూదన్, అంబర్ పేట మండల ట్రస్మా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, పాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, మలేరియా విభాగం సిబ్బంది రాఘవేందర్, పాషా తదితరులు పాల్గొన్నారు. .

# బీఆర్ఎస్‌కు షాక్ మీద షాక్....

### కాంగ్రెస్‌లో చేరిన మరో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 15 :తెలంగాణలో నేతల వలసలు కొనసాగుతున్నాయి. ఓవైపు అధికార పార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల చేరికలతో ఉత్సాహంగా కనిపిస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ ఒక్కో ప్రజా ప్రతినిధిని కోల్పోతూ డిఫెన్స్ మోడ్‌లోకి వెళ్తోంది. అయితే బీఆర్ఎస్ నుంచి వీడుతున్న ప్రజా ప్రతినిధులతో ఏ ప్రయోజనం లేదని, పదవుల కోసమే పార్టీ మారే వ్యక్తులు.. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచే దమ్ము వారికి లేదంటూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు చెబుతున్నారు. ఈ క్రమంలో మరో ఎమ్మెల్యే గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. పఠాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో సోమవారం రాత్రి కాంగ్రెస్ లో చేరారు. జూబ్లీహిల్స్ లోని రేవంత్ నివాసానికి తన అనుచరులతో వెళ్లిన మహిపాల్ రెడ్డి హస్తం పార్టీలో చేరారు. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి మహిపాల్ రెడ్డిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు కార్పొరేటర్లు, మహిపాల్ రెడ్డి అనుచరులు కాంగ్రెస్ లో చేరారు. జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ కూడా హస్తం పార్టీలో చేరిపోయారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, నీలం మధు పాల్గొన్నారు.

మిగతా..

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

మంగళవారం 16 జులై 2024




## ఇయ్యాల శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం.. భక్తులకు కీలక సూచనలు



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 15: తిరుమల శ్రీవారి ఆలయంలో రేపు ఆణివార ఆస్థానం కార్యక్రమాని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో రేపు ఆర్జిత సేవలను, వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది టీటీడీ.. రేపు సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసే పుష్పపల్లకి పై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు శ్రీవారు. కాగా, ప్రతి సంవత్సరం దక్షిణాయన పుణ్యకాలం కర్కాటక సంక్రాంతి నాడు.. అంటే తమిళుల సంప్రదాయం ప్రకారం ఆణిమాసం చివరి రోజున జరిగే ఉత్సవం కావడంతో.. ఈ వేడుకలకు ఆణివార ఆస్థానం అనే పేరు వచ్చింది. చారిత్రక నేపథ్యంలో పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలన స్వీకరించిన రోజైన ఆణివార ఆస్థానం పర్వదినం నుండి టీటీడీ వార్షిక బడ్జెట్ ప్రారంభమైయ్యేది. టీటీడీ ఏర్పడిన తరువాత వార్షిక బడ్జెట్ ఏప్రిల్ కు మారినపట్టికి.. అనాదికాలంగా వస్తున్న ఆచారాని అనుసరిస్తు నేటికి శ్రీవారి ఆలయంలో ఈ ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తుంది టీటీడీ..

## నాలుగో శ్వేత పత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు




ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 15: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అవకతవకలపై వరుసగా శ్వేతపత్రాలు విడుదల చేస్తూ వస్తున్నారు.. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి, విద్యుత్ రంగంలోని సంక్షోభం.. ఇలా వరుసగా ఇప్పటి వరకు మూడు శ్వేతపత్రాలు విడుదల చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఈ రోజు మరో శ్వేత పత్రం విడుదల చేశారు. అటవీ, సహజ వనరుల, భూమి, గనుల వ్యవహారంపై సీఎం చంద్రబాబు శ్వేత పత్రం విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో వీటన్నిటి పైనా దోపిడీ, ధ్వంసం జరిగిందని ముఖ్యమంత్రి శ్వేతపత్రంలో ప్రస్తావించారు. రికార్డుల్లో అన్ని దొరకలేదు. క్షేత్ర స్థాయిలో మరింత లోతుగా తవ్వితే తప్ప ఈ దోపిడీ ఎంత జరిగిందో చెప్పలేమన్నారు. 2019-24 మధ్య పెద్ద ఎత్తున భూ కబ్జాల జరిగాయని.. విశాఖ, ఒంగోలు, తిరుపతి, చిత్తూరుల్లో జరిగిన భూ దోపిడీలు ఒక ఉదాహరణ మాత్రమేనన్నారు. ఇళ్ల పట్టాల పేరిట భారీ స్థాయిలో దోపిడీ జరిగిందన్నారు. అక్రమంగా పార్టీ కార్యాలయాల కోసం భూమి దోచేశారని.. అనర్హులైన వారికి భూ కేటాయింపు జరిగిందని శ్వేతపత్రంలో పేర్కొన్నారు. విశాఖలో రామానాయుడు స్టూడియోలో అనధికారికంగా ఇళ్ల పట్టాలివ్వడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ ఎంపీ హయగ్రీవ పేరిట కోట్ల విలువైన భూమి కొట్టేశారన్నారు.

## వైసీపీ నేతలు మన శత్రువులు కాదు..

### జనసైనికులకు కీలక సూచనలు చేసిన పవన్ కల్యాణ్




ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 15: వైసీపీతో పాటు ఇతర పార్టీ నేతలు మన శత్రువులు కాదు.. ప్రత్యర్థులు మాత్రమే అని పవన్ కల్యాణ్ అన్నారు. చేతగాక కాదు.. కక్ష సాధింపు చర్యలు ఎవరికీ మంచివి కాదని తెలిపారు. ఎవరూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దని జనసేన కార్యకర్తలకు సూచించారు. వ్యక్తిగత దూషణలు చేయవద్దని అన్నారు. వైసీపీ చేసిన తప్పులు మనం చేయకూడదని తెలిపారు. అలాగని వైసీపీ చేసిన తప్పులు సహించలేమని అన్నారు. చట్టపరంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జనసేన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పవన్ కల్యాణ్ సత్కరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఇది కూటమి విజయమని తెలిపారు. కూటమి పార్టీలో ఎవర్నీ కించపరచవద్దని జనసైనికులకు పవన్ కల్యాణ్ సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే కూర్చుని మాట్లాడుకుందామని తెలిపారు. కుటుంబ రాజకీయాలు వద్దని.. వారసులను తీసుకురావద్దని సూచించారు. వారసులు వస్తే కొత్త నాయకత్వం ఎలా వస్తుందని ప్రశ్నించారు. క్రమశిక్షణారాహిత్యంతో తనకు తలపోటు తీసుకురావద్దని హితవు పలికారు. ప్రభుత్వ కార్యక్రమాలకు కుటుంబ సభ్యులను పిలవద్దని వార్నింగ్ ఇచ్చారు. కూటమిలో ఉన్నాం కాబట్టి అన్నీ బ్యాలెన్స్ చేస్తానని తెలిపారు. పదవులు ఉన్నా లేకున్నా పనిచేయాలని స్పష్టం చేశారు. బాధ్యతలు మోసే ప్రతి ఒక్కరికీ తాను అండగా ఉంటానని పవన్ కల్యాణ్ తెలిపారు. జనసైనికులు, వీరమహిళలు తనవైపు బలంగా నిలబడ్డారని.. ఎలాంటి పదవి ఆశించకుండా పోరాడారని పేర్కొన్నారు. ఎంత సాధించినా తగ్గి ఉండటం చాలా అవసరమన్నారు. ఊహించని మెజార్టీతో గెలవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం అవుతానని అనుకోలేదని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా తెలిపారు. భారీ విజయంతో జనసేన బాధ్యత మరింత పెరిగిందని అన్నారు.

## గ్రామపంచాయతీలో నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే..

### మంత్రి పొంగులేటి



ఇయ్యాల్టి న్యూస్, ఖమ్మం, జూలై 15: గ్రామపంచాయతీలో నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా తిరుమల పాలెం మండలం జల్లేపల్లి గ్రామంలో విష జ్వరాల భారిన పడిన వారిని మంత్రి సందర్శించారు. గత గడిచిన పది సంవత్సరాల కాలంలో గ్రామాల్లో మౌలిక వస్తులపై నిర్లక్ష్యం వహించటం వల్ల ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. మొన్నటి వరకు నేను నియోజకవర్గంలో ప్రతి గ్రామం తిరిగానని తెలిపారు. వందలాదిగా నాకు అప్లికేషన్లు వచ్చాయి గ్రామాల్లో మౌలిక వసతులు సరిగా లేవని తెలిపారు. మేము అంత చేసాం ఇంత చేసామనే ప్రభుత్వం ఏమి చేయలేదన్నారు. మేము ఇచ్చిన మాట ప్రకారం ఒక పాలేరు నియోజకవర్గం లోనే కాదు రాష్ట్రమంతా పేదలకు అండగా ఉంటామన్నారు. గ్రామపంచాయతీలో నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే అన్నారు. వీలైనంతవరకు ఈ రోజే ముఖ్యమంత్రితో మాట్లాడతానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు రాష్ట్రానికి ఆయువుపట్టు అన్నారు. గ్రామీణ ప్రాంతాలకి రావలసిన నిధుల కొరతను ముఖ్యమంత్రి మంత్రులతో మాట్లాడి గ్రాంట్ వచ్చే విధంగా నేను ఏర్పాటు చేస్తానని అన్నారు. ధనిక తెలంగాణ అని చెప్పుకున్న గత ప్రభుత్వం చూస్తే మౌలిక వసతులకే కొరత కనపడుతుందని తెలిపారు. నేను గత ప్రభుత్వం మీద నింద మోపటం కాదు మౌలిక వసతులే సరిగా చేసుకోలేకపోయారని చెప్తున్నా అన్నారు. రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్ని అభివృద్ధి చేస్తాం ఇదే మా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## రైతులకు గుడ్‌న్యూస్.. రుణమాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూలై 15: రైతు రుణమాఫీకి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. రైతు రుణమాఫీ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు వర్తిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు (ఉమ్మడిగా "బ్యాంకులు" అని పిలువబడుతాయి) వాటి బ్రాంచ్ ల నుండి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది. 12-12-2018 తేదీన లేదా ఆ తర్వాత మంజూరయిన లేక రెన్యువల్ అయిన రుణాలకు 09-12-2023 తేదీ నాటికి బకాయి ఉన్న పంటరుణాలకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద ప్రతి రైతుకుటుంబం, 2 లక్షల రూపాయల వరకు పంట రుణమాఫీకి అర్హులు. 09-12-2023 తేదీ నాటికి బకాయి వున్న అసలు, వర్తింపయ్యే వడ్డీ మొత్తం పథకానికి అర్హత కలిగి వుంటుంది. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరచడానికి, వ్యవసాయ అభివృద్ధికి, రైతుల సంక్షేమాన్ని మెరుగుపర్చడానికి, పంటరుణాల మాఫీని ఒక అత్యవసర పెట్టుబడిగా గుర్తించింది. పంట రుణమాఫీ రైతులపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించి, వారు బ్యాంకుల నుండి తక్కువ వడ్డీపై కొత్త రుణాలు తీసుకోవడానికి మరియు అధిక వడ్డీపై బయట రుణాలు తీసుకోకుండా ఉపయోగపడుతుంది. తద్వారా, అత్యవసర వ్యవసాయ ఇన్ పుట్ లు కొనుక్కోవడానికి అవకాశం కలుగచేస్తుంది. అధిక వడ్డీ రేట్ల ద్వారా తీవ్రతరం అయ్యే శాశ్వత రుణగ్రస్థత నుండి వారిని కాపాడుతుంది. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఆర్థికస్థితిని దృష్టిలో వుంచుకొని వ్యవసాయ కార్యకలాపాలు స్థిరంగా ఉండేలా చూడటానికి, రాష్ట్రంలో రైతుల కోసం పంట రుణమాఫీ-2024 పథకాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. క్షుణ్ణంగా పరిశీలించిన మీదట ప్రభుత్వం పంట రుణమాఫీ పథకం 2024 అమలు కోసం ఈ క్రింది మార్గదర్శకాలను నిర్ణయించింది.


## ప్రతీ పైసా ప్రజా సంక్షేమం కోసమే ఖర్చు పెడతాం.. మంత్రి భట్టి



ఇయ్యాల్టి న్యూస్, వరంగల్, జూలై 15: ప్రజల నుండి పన్నుల రూపంలో వచ్చే ప్రతీ పైసా ప్రజా సంక్షేమం కోసమే ఖర్చు పెడతామని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన రైతు భరోసా పథకం అవగాహన సదస్సుకు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క హాజరయ్యారు. బట్టి విక్రమార్కకు స్థానిక ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మక మైన హామీలను నెరవేర్చిందన్నారు. మాది ప్రజా ప్రభుత్వం కాబట్టి.. ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ప్రజల నుండి పన్నుల రూపంలో వచ్చే ప్రతీ పైసా ప్రజా సంక్షేమం కోసమే ఖర్చు పెడతామన్నారు. అడ్డగోలుగా వాటిని దుర్వినియోగం చేయమని తెలిపారు. రైతు భరోసా సదస్సుకు మంత్రులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ.. 12 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఎంపీ రైతు సంఘ నాయకులు హాజరయ్యారు. రైతు భరోసా విధివిధానాలపై రైతులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర వర్గాల నుంచి మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయాలను సేకరిస్తున్నారు.

## యాదగిరిగుట్టలో గిరి ప్రదక్షిణ..


### భారీగా పాల్గొన్న భక్తులు



ఇయ్యాల్టి న్యూస్, యాదాద్రి, జూలై 15: భక్తుల కొంగుబంగారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. సోమవారం ఉదయం 6.05 గంటలకు వైకుంఠ ద్వారం నుంచి ప్రారంభమైన గిరిప్రదక్షిణ కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేరసాగింది. యాదగిరీశుడి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా చేపట్టిన ఈ కర్యాక్రమంలో జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలయ ఈవో భాస్కరరావు, ధర్మకర్త నరసింహా మూర్తి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గిరిప్రదక్షిణ సందర్భంగా వ్రత మండపం, సంస్కృత పాఠశాల, అన్నదాన సత్రం, గిరిప్రదక్షిణ రోడ్డుకు ఇరువైపులా, మల్లాపురంలోని గోశాల తదితర ప్రాంతాల్లో రెండు వేల మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా, అంతకుముందు వేదమంత్రోచ్ఛరణల నడుమ గర్భాలయంలోని మూలవరులకు అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గత నెల 18న గిరి ప్రదక్షిణ పునఃప్రారంభమైంది. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా గిరి ప్రదక్షిణను నిర్వహిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో గిరి ప్రదక్షిణను ప్రవేశపెట్టిన మొదటి ఆలయంగా యాదగిరిగుట్ట దేవస్థానం నిలిచింది. కాగా, స్థానిక భక్తులు గిరిప్రదక్షిణ చేసుకొని స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ సంప్రదాయం ఏండ్లుగా కొనసాగుతున్నది. అయితే 2016లో ఆలయాన్ని పునర్నిర్మించడంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో గిరిప్రదక్షిణ చేసేందుకు ఇబ్బందికరంగా మారింది. తాజాగా ప్రభుత్వం ఆ సంప్రదాయాన్ని అధికారులు పునరుద్ధరించారు.

## ఎగువ నుంచి భారీ వరద..

### నిండుకుండలా హుస్సేన్ సాగర్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 15: ఆదివారం కురిసిన భారీ వర్షానికి హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. జలాశయంలోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హుస్సేన్ సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 514 అడుగులు. ప్రస్తుతానికి నీటి మట్టం 513 అడుగులు దాటింది. వరదన కురుస్తున్న వర్షాలకు నీరు మొత్తం హుస్సేన్ సాగర్‌లో చేరుతోంది. కూకట్‌పల్లి, బంజార, బుల్కాపూర్ నాలాల నుంచి భారీగా వరద వస్తోంది. హుస్సేన్ సాగర్ 2 గేట్లు ఎత్తి వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిమట్టం పెరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై జీహెచ్‌సీ అధికారుల పరిశీలన జరిగింది. మళ్లీ రానున్న 24 గంటల్లో వర్షాలు కురిసే నేపథ్యంలో ముంపునకు వెళ్లే కవాడిగూడ, మిగిలిన ప్రాంతాల ప్రజలనూ జీహెచ్‌సీ అధికారులు అప్రమత్తం చేశారు.

## టీ20ల్లో యశస్వి జైస్వాల్ సరికొత్త రికార్డు..


ఇయ్యాల్టి న్యూస్, స్పోర్ట్స్ , జూలై 15: జింబాంబ్వే పర్యటనలో భారత కుర్రాళ్ల జట్టు అదిరే ప్రదర్శన చేసింది.. ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఆఖరి టీ20 మ్యాచ్ లో భారత బ్యాట్స్ మెన్ యశస్వి జైస్వాల్ సరికొత్త రికార్డును సృష్టించాడు. టీ20ల్లో ఒకే బంతికి 13 పరుగులు రాబట్టిన తొలి బ్యాట్స్ మెన్ గా రికార్డులకు ఎక్కాడు. జింబాంబ్వే బౌలర్ సికందర్ రాజా బౌలింగ్ లో నో బాల్, ఫ్రీ హిట్ బంతులను సిక్సర్లుగా మలచడంతో ఈ రికార్డు సాధ్యమైంది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సికందర్ రాజా వేసిన ఫుల్ టాస్ ను డీప్ స్క్వేర్ లెగ్ మీదుగా జైస్వాల్ స్టాండ్స్ లోకి పంపించాడు. సిక్సర్ గా సిగ్నల్ ఇస్తూనే అంపైర్ ఈ డెలివరీని నో బాల్ గా ప్రకటించాడు. దీంతో ఫ్రీ హిట్ రూపంలో జైస్వాల్ కు మరో అవకాశం వచ్చింది. దీంతో జైస్వాల్ మరోసారి బంతిని సిక్సర్ గా మలిచాడు. దీంతో రెండు సిక్సర్లకు 12 పరుగులు, నో బాల్ కు ఒక పరుగు.. మొత్తం 13 పరుగులు భారత జట్టు స్కోరు బోర్డుకు యాడ్ అయ్యాయి. టీ 20 మ్యాచ్ లలో ఈ ఘనతను ఇప్పటి వరకూ ఏ బ్యాట్స్ మెన్ కూడా సాధించలేదు.



ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL

# వరుసగా రెండో సెషన్లో కూడా లాభపడ్డ మార్కెట్లు

ఇయ్యాల్టి న్యూస్, బిజినెస్, జూలై 15:దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. వరుసగా రెండో సెషన్లో లాభాలను ఆర్జించాయి. విదేశీ ఇన్వెస్ట్ మెంట్లు, దిగ్గజ కంపెనీల షేర్ల కొనుగోళ్లతో సూచీలు లాభాల్లో కదలాడాయి. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 145 పాయింట్లు లాభపడి 80,665కి చేరుకుంది. నిఫ్టీ 84 పాయింట్లు పెరిగి 24,587 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (2.55%), ఎన్టీపీసీ (2.23%), అల్ట్రాటెక్ సిమెంట్ (1.98%), మహీంద్రా అండ్ మహీంద్రా (0.96%), ఐటీసీ (0.83%). టాప్ లూజర్స్:ఏసియన్ పెయింట్ (-1.44%), టాటా స్టీల్ (-1.13%), యాక్సిస్ బ్యాంక్ (-0.77%), జేఎస్ డబ్ల్యూ స్టీల్ (-0.44%), టెక్ మహీంద్రా (-0.43%).





## పెండ్లిలో అత్తమామలను చెప్పుతో కొట్టిన వరుడు.. పెళ్లి కూతురు ఏం చేసిందంటే..?

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 15: ఉత్తర ప్రదేశ్?లో ఓ పెళ్లిలో వింత ఘటన చోటు చేసుకుంది. కాబోయే అత్తామామలను వరుడు చెప్పుతో కొట్టాడు. పెళ్లికి ముందు తాగి మండపానికి వచ్చిన వరుడు ఈ ఘటనకు పాల్పడ్డాడు. దీంతో పెళ్లి పీటల మీద కూర్చున్న వధువుకు కోపమొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెళ్లి చేసుకుని అత్తమామల పట్ల గౌరవంగా ఉండాల్సిన వరుడి ప్రవర్తన పట్ల పెళ్లికి వచ్చిన బంధువులు ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు.



వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్‌లోని బండాలో వరుడు దిలీప్ (25)తో వధువు అంజలి (18) వివాహం జరుగుతుంది. ఇంకాసేపట్లో పెళ్లి జరుగుతుందనగా.. పెళ్లి మండపంపై ఉన్న వధువు తల్లిదండ్రులను వరుడు దిలీప్ ఒక్కసారిగా చెప్పుతో కొట్టాడు. దీంతో పెళ్లికి వచ్చిన బంధువులు షాక్ కు గురయ్యారు. కాగా.. తన తల్లిదండ్రులపై ఇలాంటి ఘటనకు పాల్పడిన దిలీప్ పై వధువు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వరుడు దిలీప్, అతని కుటుంబ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం వధువు తరుపు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. బంధువుల జోక్యంతో ఇరువర్గాలకు నచ్చజెప్పారు. ఆ తర్వాత ఆలయంలో ఇరువర్గాల సమక్షంలో వధూవరులకు వివాహం జరిపించారు. కాగా.. ఈ ఘటనపై ఇరువర్గాలు అంగీకారంతో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని, పెళ్లి పూర్తి అయిందని పోలీసులు తెలిపారు.

## భార్య 'టీ' పోయలేదని... భర్త సూసైడ్



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 15: బీహార్‌లోని భోజ్‌పూర్‌లో విషాద ఘటన వెలుగులోకి వచ్చింది. భర్త టీ చేయమని భార్యను కోరగా ఆమె నిరాకరించింది. దీంతో కోపంతో భర్త విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.
వివరాల్లోకి వెళ్తే.. ఈ ఘటన ఇమాద్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బిహ్తా గ్రామంలో జరిగింది. దంపతులు రాజ్ కుమార్ సాహ్, సుష్మా దేవి ఆసుపత్రిలో చేరిన తన తల్లిని చూసేందుకు వెళ్లారు. అయితే.. ఆ సమయంలో భర్త రాజ్ కుమార్ తన భార్యను 'టీ' చేసి ఇవ్వమని కోరాడు. భార్య అందుకు నిరాకరించింది. దీంతో ఆగ్రహంతో అక్కడి నుంచి ఇంటికి వచ్చిన భర్త.. పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని ఆస్పత్రిలో ఉన్న భార్య సుష్మకు స్థానికులు తెలియజేశారు. వెంటనే భార్య ఇంటికి చేరుకుని సమీప ఆసుపత్రిలో చేర్పించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో పాట్నాకు తరలించారు. పాట్నాకు తరలిస్తుండగా భర్త రాజ్ కుమార్ మృతి చెందాడు.

## ట్రంప్‌పై హత్యాయత్నం.. యూఎస్ సీక్రెట్ సర్వీస్ అధిపతిపై విమర్శలు, రాజీనామాకు డిమాండ్

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 15:అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నంతో అంతర్జాతీయ సమాజం ఉలిక్కిపడింది.అత్యంత శక్తివంతమైన, కట్టుదిట్టమైన భద్రత ఉండే అమెరికాలో ఓ మాజీ అధ్యక్షుడిని చంపే ప్రయత్నం చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో సీక్రెట్ సర్వీస్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.యూఎస్ సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ కింబర్లీ చీటిల్ తక్షణం రాజీనామా చేయాలంటూ సోషల్ మీడియాలో డిమాండ్లు వినిపిస్తున్నాయి.న్యూయార్క్ పోస్ట్ కథనం ప్రకారం.మాజీ ఎఫ్‌బీఐ అసిస్టెంట్ డైరెక్టర్ క్రిస్ స్వీకర్ మాట్లాడుతూ ట్రంప్‌పై దాడి భద్రతా వైఫల్యం వల్లేనన్నారు.దుండగుడు ఓ పిల్లాడు కాబట్టి సరిపోయింది, అలా కాకుండా ప్రొఫెషనల్ షూటర్ అయ్యుంటే పరిస్థితి ఎలా ఉండేదోనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ట్రంప్‌ను పోడియం నుంచి బయటకు




తీసుకురావడానికి 2 నిమిషాల కంటే ఎక్కువ సమయం పట్టిందని స్వీకర్ తెలిపారు.వీఐపీపై దాడి జరగకుండా అడ్డుకోవడం, వీఐపీని డేంజర్ జోన్ నుంచి సెకన్ల వ్యవధిలో తరలించడం సీక్రెట్ సర్వీస్ పని అని ఆయన వెల్లడించారు. 2 నిమిషాల ఆలస్యమనేది చాలా ఎక్కువని, స్పాట్‌లో సెకండ్ షూటర్ ఎవరైనా ఉండి ఉంటే.అతను మిగతా పని పూర్తి చేసేవాడని స్వీకర్ పేర్కొన్నారు.పోడియం కింద దాక్కొన్న ట్రంప్‌ను తిరిగి పైకి లేచి పిడికిలి ఎత్తేవరకు ఉండకూడదన్నారు.ట్రంప్‌ను తరలించే సమయంలో ఆయన తల భాగం కనిపించిందని.పొడవుగా ఉండే మేల్ ఆఫీసర్లు ఆయనకు వెనుక నుంచి రక్షణ కల్పిస్తే, పొట్టిగా ఉన్న ఓ మహిళా అధికారి ముందు ఉండటం ఏంటని స్వీకర్ ప్రశ్నించారుమరోవైపు.ట్రంప్‌పై దాడి జరగడానికి స్థానిక పోలీసుల వైఫల్యమే కారణమని సీక్రెట్ సర్వీస్ తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది.నిందితుడు పైకప్పు ఎక్కి.గన్‌తో పొజిషన్ తీసుకున్నా పట్టించుకోలేదని తెలిపింది.ట్రంప్ ర్యాలీ జరిగిన ఏజీఆర్ ఇంటర్నేషనల్ ఐఎన్‌సీ ఫ్యాక్టరీ గ్రౌండ్స్‌ను పెట్రోలింగ్ చేయాల్సిన బాధ్యత వారిదేనని సీక్రెట్ సర్వీస్ చెబుతోంది.

## రైల్వే బ్రిడ్జిపై దంపతుల రీల్స్.. అంతలో రైలు ఎంట్రీ!.. సీన్ కట్ చేస్తే....



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 15:సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ తెచ్చుకునేందుకు యువత పిచ్చి పిచ్చి రీల్స్ చేసి నెట్టింట వదులుతున్నారు. రీల్స్ పిచ్చిలో వారేం చేస్తున్నారో.. ఎక్కడ ఉంటున్నారో.. అనే విషయం పూర్తిగా పెడచెవిన పెడుతున్నారు. తాజా ఓ జంట రీల్స్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజస్థాన్ పాలిలోని గోరంఘాట్ బ్రిడ్జిపై సోషల్ మీడియాలో రీల్ కోసం శనివారం మధ్యాహ్నం భార్యాభర్తలు వచ్చి ఫొటో షూట్ చేస్తున్నారు. అయితే బ్రిడ్జిపైకి అకస్మాత్తుగా ఓ రైలు వచ్చింది. అది ఒకటే ట్రాక్ కావడంతో పక్కన నిలబడేందుకు సైతం చోటు లేకపోయింది. దీంతో వారు దిక్కుతోచని స్థితిలో ప్రాణాలకు తెగించి ఏకంగా 90 అడుగుల లోయలోకి దూకేశారు. దీంతో భార్యభర్తలిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి.రైలు వచ్చే సమయంలో ప్రమాదానికి గురైన జంట.. ఫొటో షూట్‌లో బిజీగా ఉన్నారని.. అక్కడే కొంత దూరంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రైలు దాదాపు వారి సమీపంలోకి వచ్చే వరకు వారికి తెలియదు. అకస్మాత్తుగా ఎదురుగా వస్తున్న రైలును చూసి, ప్రాణాలు దక్కించుకోవడానికి 90 అడుగుల కింద ఉన్న వాగులోకి దూకేశారు. గాయపడిన దంపతులను సమీప ఆసుపత్రికి తరలించారు. ఇద్దరికీ తీవ్రగాయాలు అయ్యాయి. వీరిలో భర్త పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో దృశ్యాలు వైరల్‌గా మారాయి. కాగా, ప్రకృతి అందాలకు గోరంఘాట్ బ్రిడ్జి ఫేమస్. దీంతో నిత్యం వేల మంది పర్యాటకులు అక్కడికి వచ్చి, ప్రమాదకర పరిస్థితుల్లో ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు.

## నేను చనిపోయాను అనుకున్నాను.. కాల్పుల ఘటనపై స్పందించిన డొనాల్డ్ ట్రంప్..


ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 15:అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తుండగా ఓ వ్యక్తి కాల్పులు జరపడంతో చెవికి తీవ్ర గాయమైంది. దీని గురించి తాజాగా ట్రంప్ రియాక్ట్ అయ్యారు. అసలు నేను మీ ముందు ఇలా ఉండేవాడినే కాదు.. కాల్పుల ఘటనలో చనిపోయాననే అనుకున్నాను.. ఇదొక చిత్రమైన పరిస్థితి అని ట్రంప్ తెలిపారు. ఆ సమయంలో ఆయన చెవికి బ్యాండేజ్ ఉండటం గమనించొచ్చు. ఇక, రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో పాల్గొనేందుకు విమానంలో ప్రయాణిస్తూ మాజీ అధ్యక్షుడు ఈ విధంగా రియాక్ట్ అయ్యారు. ఇలాంటి చర్య మన దేశంలో జరగడం నమ్మశక్యంగా లేదన్నారు. కాల్పుల



శబ్దాలు వినగానే ఏదో జరంగుతుందనేది అర్థమైందన్నారు. ఇక, డొనాల్డ్ ట్రంప్ పై కాల్పుల ఘటన తర్వాత అధ్యక్ష రేసు ఏకపక్షమవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తూటా తాకిన వెంటనే కిందకు వంగి.. తర్వాత పిడికిలి బిగించి బలంగా పైకి లేచిన ట్రంప్ తీరు పలువురిని ఆకర్షించింది. యూఎస్ కు కావాల్సింది ఇలాంటి యోధుడే' అని రిపబ్లికన్లు జోరుగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఆయన వ్యతిరేకులు కుట్ర సిద్ధాంతాలకు తెర తీశారని ఆరోపణలు గుప్పించారు. ఇదంతా సానుభూతి కోసమా అని విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖంపై రక్తం.. పిడికిలి బిగించి ఎత్తిన చేయి.. వెనక అమెరికా జెండా.. చుట్టూ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లున్న ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అలాంటి టైంలో కూడా ఇంత పర్ఫెక్ట్‌గా తీసిన ఫోటోపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్‌ను నమ్మలేమంటూ పలువురు ఆ ఘటన దృశ్యాలను నెట్టింట షేర్ చేస్తున్నారు.

## ఎన్నికలు సమీపిస్తున్నా మారని బైడెన్ తీరు.. బ్యాలెట్ బాక్సులకు బదులు.. బ్యాటిల్ బాక్సులంటూ..!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 15:అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాటల తడబాటు కొనసాగుతూనే ఉంది..! ప్రెసిడెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధ్యక్షుడి ప్రవర్తనతో డెమోక్రాటిక్ పార్టీలో తీవ్ర ఆందోళ వ్యక్తమవుతోంది. ఎన్నికల వేళ బైడెన్ తడబడుతుండటం డెమోక్రాట్లకు ఇబ్బందికరంగా మారుతోంది. ఇప్పటికే మతిమరుపు, తడబాట్లతో తీవ్ర విమర్శలపాలైన బైడెన్.. తాజాగా మరోసారి అదేపొరపాటు చేసి మీడియాకు చిక్కారు. పెన్సిల్వేనియాలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై దాడి నేపథ్యంలో బైడెన్ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా తప్పులు మాట్లాడారు. బ్యాలెట్ బాక్సులకు బదులు బ్యాటిల్ బాక్సులు



(యుద్ధపు పెట్టెలు) అని సంభోదించారు. దీంతో అక్కడే ఉన్న డెమోక్రాటిక్ పార్టీ నేతలు తలలు పట్టుకున్నారు.
'నేను మన ప్రజాస్వామ్యం కోసం గట్టిగా మాట్లాడటం కొనసాగిస్తాను. మన రాజ్యాంగం, చట్ట నియమాల కోసం నిలబడతా. అమెరికాలో మా విభేదాల పరిష్కారానికి బ్యాటిల్ బాక్సు ను నమ్ముతాం. ఇప్పుడు కూడా మేం వాటిని బ్యాటిల్ బాక్సుల్లోనే పరిష్కరించుకుంటాం. బుల్లెట్లతో కాదు' అని వ్యాఖ్యానించారు. అయితే, బ్యాలెట్ బాక్సులు అనడానికి బదులు బ్యాటిల్ బాక్సులు అని తప్పుగా మాట్లాడి మరోసారి హెడ్‌లైన్స్‌లో నిలిచారు. దీంతో అధ్యక్షుడి మాటలతో డెమోక్రాటిక్ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

## ప్రధాని మోదీతో సీఎం హేమంత్ సోరెన్ భేటీ



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 15:జార?ండ్ సీఎం హేమంత్ సోరెన్ ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. గత వారం హస్తిన పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి హేమంత్ పలువురి ప్రముఖులను కలిశారు. ఇక సోమవారం మధ్యాహ్నం ప్రధాని మోడీని కలిశారు. మర్యాదపూర్వకంగా ఈ సమావేశం జరిగినట్లుగా తెలుస్తోంది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చకు వచ్చినట్లు సమాచారం. హేమంత్ సోరెన్.. తన సతీమణి కల్పనా సోరెన్‌తో కలిసి శనివారం ఢిల్లీకి వచ్చారు. కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీని కలిశారు. అనంతరం అక్కడ నుంచి నేరుగా ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసానికి చేరుకుని.. ఆయన సతీమణి సునీతా కేజ్రీవాల్‌ను కలిశారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలపై, ఈడీ, సీబీఐ కేసులపై చర్చకు వచ్చినట్లు వార్తలు వినిపించాయి. మనీలాండరింగ్ కేసులో జనవరి 31న హేమంత్ సోరెన్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఐదు నెలల తర్వాత బెయిల్ లభించడంతో జైలు నుంచి విడుదలయ్యారు. జైలుకు వెళ్లిన సమయంలో జేఎంఎం పార్టీ సీనియర్ నేత చంపై సోరెన్ ముఖ్యమంత్రి పదవిని అధిరోహించారు. హేమంత్ బెయిల్‌పై ఇంటికి రావడంతో చంపై ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి హేమంత్‌కు మార్గం సుగమం చేశారు. ఇక జూలై 4న మూడోసారి జార?ండ్ సీఎంగా హేమంత్ ప్రమాణస్వీకారం చేశారు.

## దారుణం.. రెండు నెలల పసికందును చంపేసిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్

ఇయ్యాల్టి న్యూస్, క్రైం, జూలై 15:ఏలూరు జిల్లా లింగపాలెం మండలం పాశ్చా నగరంలో దారుణం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో మరదలి రెండు నెలల పసికందును హత్య చేశాడు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ చల్లపాటి బాలాజీ అనే వ్యక్తి. కానిస్టేబుల్ బాలాజీపై గతం కేసు నమోదు కాగా.. ఆ కేసు నిమిత్తం ఏలూరు కోర్టుకు హాజరయ్యాడు. అక్కడే కానిస్టేబుల్ తన భార్య, మామపై దాడికి పాల్పడ్డాడు. అనంతరం పాశ్చానగరంలోని ఇంటికి వచ్చి మరదలిని, అత్తపై ఆ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో మరదలి రెండు నెలల పసిబాబును పీకనులిమి చంపేశాడు. ఈ క్రమంలో ఇంట్లో వారు గట్టిగా అరవడంతో గ్రామస్థులు అక్కడికి విచ్చేశారు. పసికందును హత్య చేసిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ బాలాజీకి గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. బాబు మృతదేహాన్ని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్త్తున్నరు.



## నేపాల్ నూతన ప్రధాని కేపీ శర్మ ఓలీకి మోదీ శుభాకాంక్షలు

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 15:నేపాల్ నూతన ప్రధాని కేపీ శర్మ ఓలీ కి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఎక్స్ వేదికగా మోదీ ఓ పోస్ట్ పెట్టారు. నేపాల్ ప్రధాన మంత్రిగా నియమితులైన ఓలీకి అభినందనలు తెలిపారు. రెండు దేశాల మధ్య స్నేహ బంధాలను మరింత బలోపేతం చేయడం, సమష్టి ప్రయోజనాలను కాపాడుకోవడానికి పరస్పర సహకారంతో పనిచేసేందుకు ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. నేపాల్ ప్రధానిగా కేపీ శర్మ ఓలి మూడోసారి నియమితులయ్యారు. నేపాల్-యునైటెడ్ మార్క్సి స్ట్ లెనినిస్ట్ (సీపీఎన్-యూఎంఎల్), నేపాల్ కాంగ్రెస్ (ఎన్‌సీ)లతో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో కొత్త ప్రధానిగా ఓలిని అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ఆదివారం నియమించారు. శుక్రవారం ప్రజా ప్రతినిధుల సభలో విశ్వాస పరీక్షలో ప్రధాని పుష్పకుమార్ దహల్ ప్రచండ ఓడిపోవడంతో ఓలి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఓలి, అతని మంత్రివర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుంది.



ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

## హైదరాబాద్ లో భారీగా డ్రగ్స్ పట్టివేత.. పోలీసుల అదుపులో హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 15: హైదరాబాద్ లో డ్రగ్స్ వ్యవహారం మరోసారి కలకలం రేపింది. నగరంలోని రాజేంద్రనగర్ సమీపంలో పోలీసులు పెద్ద మొత్తంలో డ్రగ్స్ ను పట్టుకున్నారు. నార్కోటిక్స్ విభాగం, ఎస్ఓటీ విభాగం, రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో 200 గ్రాముల కొకైన్ పట్టుబడింది. దీని విలువ రూ. 2 కోట్లు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. ఈ ఆపరేషన్ లో డ్రగ్స్ తరలిస్తున్న నలుగురు పట్టుబడ్డారు. వీరిలో హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ సింగ్ కూడా ఉన్నట్టు సమాచారం. మిగిలిన వారంతా నైజీరియన్లు. గోవా కేంద్రంగా డ్రగ్స్ దందా నడుస్తున్నట్టు నిందితుల నుంచి పోలీసులు తెలుసుకున్నారు. గతంలో రకుల్ ప్రీత్ సింగ్ కూడా డ్రగ్స్ వ్యవహారంలో విచారణ ఎదుర్కొన్న సంగతి తెలిసిందే.



**చూసి ముర్వాలే**



## అంబానీతో సహా ప్రముఖులందరికి..
## దగ్గరుండి పవన్ కళ్యాణ్‌ని పరిచయం చేసిన చంద్రబాబు







ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 15: అనంత్ అంబానీ పెళ్లి వేడుకలు గత ఐదురోజులుగా ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. దేశ విదేశాల నుంచి సినీ, రాజకీయ, వ్యాపార, క్రీడా రంగాల్లోని ప్రముఖులు చాలా మంది ఈ పెళ్ళికి హాజరయి సందడి చేసారు. మెయిన్ పెళ్లి రోజు మాత్రం చాలా మంది సెలబ్రిటీలు హాజరయ్యారు. మన టాలీవుడ్ నుంచి కూడా రామ్ చరణ్, ఉపాసన, వెంకటేష్ ఫ్యామిలీ, అఖిల్, మహేష్ బాబు ఫ్యామిలీ.. ఇలా పలువురు హాజరయ్యారు.

ఏపీ రాజకీయాల నుంచి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ వందకు వంద శాతం విజయం సాధించడంతో దేశ వ్యాప్తంగా పవన్ బాగా ఫేమస్ అయ్యారు. దేశ వ్యాప్తంగా పలువురు రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడుతున్నారు. మోదీ కూడా పవన్ సునామి లాంటివాడు అనడంతో నార్త్ లో కూడా బాగా పాపులర్ అయ్యాడు పవన్. అయితే తాజాగా పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలిసి అనంత్ అంబానీ పెళ్లి వేడుకకు వెళ్లారు. చంద్రబాబు 40 ఏళ్ళ రాజకీయ జీవితంలో నేషనల్ వైడ్ కూడా పాపులర్ అయిన సంగతి తెలిసిందే. ముకేశ్ అంబానీ స్వయంగా వచ్చి చంద్రబాబుని పలకరించారు. అప్పుడు చంద్రబాబు పక్కనే ఉన్న పవన్ కళ్యాణ్ ని కూడా అంబానీకి పరిచయం చేసారు. అలాగే మహారాష్ట్ర సీఎం షిండేకు కూడా పవన్ కళ్యాణ్ ని చంద్రబాబు పరిచయం చేసారు. ఇలా పలువురు దేశ ప్రముఖులకు, రాజకీయ నాయకులకు పవన్ కళ్యాణ్ ని చంద్రబాబు దగ్గరుండి పరిచయం చేసారు. ఈ విషయంలో చంద్రబాబుని జనసైనికులు, పవన్ ఫ్యాన్స్ అభినందిస్తున్నారు.

### అనంత్ అంబానీ దావత్ వేడుకల్లో..
## తళుక్కుమన్న రష్మిక మందన్న..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 15: హీరోయిన్ రష్మిక మందన్న ఇటీవల జరిగిన అనంత్ అంబానీ - రాధికా మర్చంట్ పెళ్లి వేడుకల్లో ఇలా చీరలో మెరిపించింది.

### ట్రెడిషనల్ వేర్ లో గ్లామర్ మెరుపులు..
### కాజల్ లేటెస్ట్ ఫోటోలు చూస్తే అంతే !

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 15:టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ మరోసారి అందాల కనువిందు చేసింది. ట్రెడిషనల్ వేర్ లో గ్లామర్ మెరుపులు మెరిపించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు కుర్రకారును కవ్విస్తున్నాయి.

## ట్రెడిషనల్ లుక్‌లో ఫిదా చేస్తున్న తమన్నా...
### బ్లాక్ అండ్ గోల్డ్ లెహెంగాలో మిల్కీ బ్యూటీ తళుకులు

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 15: తమన్నా ట్రెడిషనల్ లుక్ తళుక్కున మెరిసింది. బ్లాక్ అండ్ గోల్డ్ లెహెంగాలో, ట్రెడిషనల్ జూవెల్లరితో ఈ భామ ఫిదా చేసింది. ప్రస్తుతం తమన్నా ఫోటోలు ఫ్యాన్స్‌ని బాగా ఆకట్టుకుంటున్నాయి.

## లండన్ విమానం ఎక్కిన రామ్‌చరణ్..
## పెండ్లి నుంచి డైరెక్ట్‌గా..?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 15: ప్రముఖ వ్యాపారవేత్త ముకేశ్ అంబానీ కొడుకు పెళ్లి ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎంతో ఘనంగా జరిగింది. ఈ వేడకకు టాలీవుడ్ మొదలు హాలీవుడ్ వరకు సెలబ్రిటీలు హాజరయ్యారు. మెగాపవర్ స్టార్ రామ్‌చరణ్ తన భార్య ఉపాసన కూతురు క్లీంకారతో కలిసి అనంత్ అంబానీ-రాధికా మర్చంట్‌ల వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ వేడుక ముగియడంతో సెలబ్రిటీలు అంతా వారి వారి స్వస్థలాలకు చేరుకుంటున్నారు.


అయితే.. రామ్‌చరణ్ మాత్రం హైదరాబాద్‌కు రావడం లేదు. విహారయాత్ర కోసం లండన్ వెలుతున్నారు. ఫ్యామిలీతో వెకేషన్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్న చరణ్.. పెళ్లి వేడుక ముగిసిన తరువాత ముంబై నుంచే తన కుటుంబంతో కలిసి లండన్ విమానం ఎక్కారు. లండన్‌లో చరణ్ ఎన్ని రోజులు ఉంటారనే విషయాలు ఇంకా తెలియరాలేదు. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ గేమ్ ఛేంజర్ మూవీలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్‌చరణ్‌కు సంబంధించిన షూటింగ్ పార్ట్ ఇప్పటికే పూర్తైంది. త్వరలోనే బుచ్చిబాబు దర్శకత్వంలో చరణ్ ఓ సినిమాలో నటించనున్నాడు. రామ్‌చరణ్ కెరీర్‌లో 16వ సినిమాగా ఈ మూవీ తెరకెక్కనుంది.





### దిశా పటానీ... బాబోయ్ ఎంత అందం!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 15: అందాల భామ అలా చీర కడితే చూడకుండా ఎవరు మాత్రం ఉండగలరు చెప్పండి! ఆ అందాలను పొగడకుండా ఎవరు ఉంటారు చెప్పండి! చీరలో దిశా పటానీ కొత్త ఫోటోలు చూస్తే ఆ మాటలే చెప్పాలి.



Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838